క్లుప్తంగా

145 మందికి వైద్య పరీక్షలు



కపిలేశ్వరపురంలో వృద్ధుడి ఇంటికి వెళ్లి పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనూజ ప్రియాంక

కపిలేశ్వరపురం: ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక సత్యనారాయణపురంలో 145 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అంగర పీహెచ్‌సీ వైద్యురాలు జె.అనూజ ప్రియాంక గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర్ బాలికలను పరీక్షించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేశారు. అనంతరం వృద్ధాప్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వారి ఇంటికెళ్లి వైద్య పరీక్షలు చేశారు. శిబిరాన్ని వార్డు సభ్యులు కె.వెంకటలక్ష్మి, గ్రామ పెద్దలు సందర్శించారు. హెచ్ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్, వైద్య ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది సేవలందించారు.

భీమేశ్వరాలయ అర్చకుడు దత్తు మృతి



కళ్లేపల్లి విశ్వనాథ దత్తు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయ వంశ పారంపర్య అర్చకుడు కళ్లేపల్లి విశ్వనాథ దత్తు (72) శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్ర బోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ నున్న సత్యవతి, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి (తారకేశ్వర రావు) తదితరులు సంతాపం తెలియజేశారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి



డ్రైవర్లకు రోడ్డు నిబంధనలు వివరిస్తున్న ఎస్సై చిరంజీవి

కె.గంగవరం: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై కె.చిరంజీవి సూచించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కె.గంగవరంలో శుక్రవారం ఆటో యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి వేగంగా ఆటోలు నడపరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపడం నేరమన్నారు. డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరికీ లైసెన్సు ఉండాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, నేరస్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సామాన్య పౌరుడిగా బాధ్యత నిర్వర్తించాలన్నారు.

25 లోగా పంట నమోదు చేసుకోవాలి



ఉండూరులో రైతులకు సూచనలిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: మండలంలోని రైతులు ఈ నెల 25 లోగా పంట నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కాపవరం, ఉండూరు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఆయన సందర్శించి క్షేత్రస్థాయిలో రైతులను కలిశారు. పంట నమోదు ప్రక్రియ జరుగుతున్న తీరును పరిశీలించారు. రైతులు ఏ రకం పంట వేశారనేది తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాల్లో తెలియజేయాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు నవ్యసుధ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

కాజులూరు: గ్యాస్ వినియోగంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సర్పంచ్ పోతుల వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం దుగ్గుదురులో గెయిల్ ఇండియా అధికారుల ఆధ్వర్యంలో రామచంద్రపురానికి చెందిన బుర్రకథ కళాకారులు గొర్రెల రాము, కృష్ణ సోదరుల బృందం బుర్రకథ నిర్వహించారు. వంట గ్యాస్ వినియోగం, గెయిల్ ఇండియా సహజ వాయువుల పైప్‌లైన్, వాటి రక్షణ కోసం ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పోతుల జ్యోతికుమార్, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వద్దు.. భద్రతే ముద్దు

- మానవ తప్పిదాలతో రోడ్డు ప్రమాదాలు
- ఛిద్రమవుతున్న చిన్న కుటుంబాలు
- 24 వరకూ రహదారి భద్రతా వారోత్సవాలు
- క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు



టేకి -అంగర రహదారిపై కారు- ఆటో ఢీకొన్న ఘటనలో ఛిద్రమైన వాహనాలు (ఫైల్)

కపిలేశ్వరపురం: విలువైన ప్రాణం పదికాలాల పాటు నిలిస్తే కుటుంబం సౌఖ్యంగా ఉంటుంది. మానవ తప్పిదాలతో రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణం కోల్పోతే ఆ కుటుంబం మొత్తం వీధిన పడుతుంది. ప్రమాదంలో దుర్మరణం పాలవ్వడం మరణించిన వ్యక్తికే కాకుండా ఆ కుటుంబానికి బాధాకరం. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం నిర్లక్ష్యం కారణంగా జరిగినవే. వాహనాలు నడిపే సమయంలో నిర్లక్ష్యాన్ని వీడి విలువైన ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది. రహదారి భద్రతా వారోత్సవాలు నేపథ్యంలో ఈ కథనం...

దేశంలో 4.12 లక్షల ప్రమాదాలు

పోలీసు శాఖ, రోడ్డు రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని వాహన రంగానికి చెందిన సమూహాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి రోడ్డు ప్రయాణ నియమ నిబంధనలను వివరిస్తున్నారు. కేంద్ర రోడ్డు రవాణా హైవేల మంత్రిత్వ శాఖ, జాతీయ నేర గణాంక సంస్థ తాజా నివేదిక ప్రకారం దేశంలో 2021లో 4.12 లక్షల ప్రమాదాలు సంభవించాయి. ఆయా ప్రమాదాల్లో 1.53 మంది ప్రాణాలను కోల్పోగా 3.84 లక్షలు మంది గాయాలు పాలయ్యారు. చనిపోయినవారిలో 44 శాతం మంది ద్విచక్రవాహన ప్రమాదాలకు గురైన వారు. 74 శాతం ప్రమాదాలు అతివేగం కారయంగా జరిగినట్టు నిర్ధారించారు. 2021 ఆంధ్ర ప్రదేశ్‌లో 21,556 రోడ్డు ప్రమాదాలు సంభవించగా 8వేల మంది చనిపోయారు. వేగ నియంత్ర కోసం ప్రభుత్వం ఎల్రక్టానిక్ పరికరాలను వినియోగిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేస్తోంది.

రెండు నియోజకవర్గాల్లో ప్రమాదాలిలా...

ఈ నెల 3న వెంకటాయపాలెం వంతెన వద్ద అదే గ్రామానికి చెందిన ఇద్దరు మోటారు బైక్‌పై ప్రయాణిస్తూ జారి పడి గాయాలుపాలయ్యారు. అదే గ్రామానికి చెందిన వృద్ధుడు గతేడాది డిసెంబర్ 27న బైక్‌పై వెళుతుండగా కుక్క అడ్డురావడంతో జారిపడ్డాడు. అతడికి తీవ్ర గాయాలయ్యాయి. గత నెల 11న కాజులూరు మండలం జగన్నాయకగిరిలో మోటారు బైక్‌ను ఆటో ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కుయ్యేరులో ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. 31న మండపేట మండలం వేములపల్లిలో ఎదురెదురుగా రెండు మోటారు బైక్‌లు ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ నెల 14న పసలపూడి-మాచవరం మధ్య కోళ్లఫారం వద్ద ధాన్యం లోడు ట్రాక్టర్ బోల్తా పడింది. 2017 నుంచి 2020 వరకూ మండపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 90 ప్రమాదాలు జరగ్గా 22 మంది మృతి చెందారు. 68 మంది క్షతగాత్రులయ్యారు. మండపేట రూరల్ స్టేషన్ పరిధిలో 75 ప్రమాదాల్లో 35 మంది మృతి చెందగా 56 మంది గాయాలు పాలయ్యారు. రాయవరంలో 39 ప్రమాదాల్లో 19 మంది మృతి, 20 మందికి గాయాలయ్యాయి. అంగరలో 47 ప్రమాదాల్లో 20 మంది మృతి చెందగా 27 మంది గాయాలుపాలయ్యారు.

ప్రమాదాల నివారణకు ఇలా..

రోడ్డు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ద్విచక్ర వాహనాన్ని నడిపేవారు, బైక్‌పై కూర్చున్నవారు హెల్మెట్‌ను ధరించాలి. కారును నడిపేవారు, కారులో కూర్చున్నవారు విధిగా సీటు బెల్ట్ ధరించాలి. అలసట చెందిన వారు, అనారోగ్యంతో ఉన్నవారు వాహనాలను నడపకుండా ఉండటం, భారీ వాహనాలు నడిపేవారు తరచూ అవసరమైన మేరకు విశ్రాంతి తీసుకోవడం, వాహనాన్ని నడిపేవారు సెల్‌ఫోన్ మాట్లాడకుండా జాగ్రత్తపడటం.

నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు



రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం నిర్లక్ష్యం, నిబంధనలను పాటించకపోవడమే అని తేలింది. మరీ ముఖ్యంగా వాహనదారులు హెల్మెట్ పెట్టుకోకపోవడం, పరిమితికి మించి వాహనంపై ప్రయాణాలు చేయడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. డ్రైవింగ్ సమయంలో ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.

– చంటి, ఎస్సై, అంగర, కపిలేశ్వరపురం

సోమేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన



సోమేశ్వర స్వామికి లక్షబిల్వార్చన పూజ నిర్వహిస్తున్న పండితులు

రాయవరం: మండలంలోని వెంటూరు సోమేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం లక్ష బిల్వార్చన పూజ నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం లక్ష మారేడు దళాలతో బిల్వార్చన, పార్థివేశ్వరునికి లింగార్చన చేపట్టి శాంతి కల్యాణం, దీపధూప సేవలు జరిపారు. మధ్యాహ్నం ఉత్సవ కమిటీ సభ్యుడు మిర్తిపాటి సర్వేశ్వరరావు కుమారులు కృష్ణమూర్తి, సోమశేఖరం, ఫణిప్రకాష్ సౌజన్యంతో ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. మాసశివరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొండేపూడి జోగన్న, సభ్యులు టి.రామారావు, డి.రాఘవరాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్రైడే-డ్రైడే

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లోనూ శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. మాచర, వాకతిప్ప, అంగర, టేకి, కపిలేశ్వరపురం, తాతపూడి, నేలటూరు, వల్లూరు, కాలేరు, నల్లూరు తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు చెత్తను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

'విశాఖ ఉక్కు' పరిరక్షణ అందరి బాధ్యత



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సత్తిబాబు తదితరులు

రామచంద్రపురం: విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు అన్నారు. ఈ పరిశ్రమను కాపాడుకోవడంలో భాగంగా రెండేళ్లుగా పోరాటం చేస్తున్న కార్మిక వర్గానికి మద్దతుగా 23న రామచంద్రపురం, 24న కొత్తపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వద్ద నిరాహార దీక్షలు, 25న జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇందులో భాగంగా స్థానిక చెలికాని రామారావు భవనంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఉండవల్లి గోపాలరావు అధ్యక్షతన సీపీఐ, ఏఐటీయూసీ పిలుపుతో పార్టీ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం శుక్రవారం జరిగింది. అనంతరం నిరాహార దీక్షలు, నిరసన కార్యక్రమాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. సీపీఐ కార్యవర్గ సభ్యుడు పెద్దిరెడ్డి రాము, వివిధ కార్మిక సంఘాల నేతలు జి.రాజు, బి.సత్యనారాయణ, తోట సూరిబాబు, ఆర్‌కే రాజు, ఎం.ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాయవరం: మండలంలో సోమేశ్వరం గ్రామానికి చెందిన కుంచాల దుర్గారావు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ పి.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..దుర్గారావు అధికంగా మద్యం తాగడంతో భార్య ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో మనస్తాపానికి గురైన దుర్గారావు పురుగుల మందు తాగి వచ్చి విషయాన్ని భార్యకు తెలియజేశాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన దుర్గారావును రామచంద్రపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చిక్సిత పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

చోరీ కేసులో నిందితులకు జైలు

రామచంద్రపురం: పట్టణంలో బుల్లెట్ వాహనం చోరీ చేసిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు రామచంద్రపురం ఎస్ఐ డి.సురేష్‌బాబు శుక్రవారం విలేకరులకు తెలిపారు. గత ఏడాది ఫిబ్రవరి 23వ తేదీన మోర్త సురేంద్ర శ్రీహరికి చెందిన బుల్లెట్ వాహనం పట్టణంలో చోరీకి గురైంది. శ్రీహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కృష్ణాజిల్లా పామర్రుకు చెందిన చుండ్రు రమేష్‌బాబు, కాకినాడకు చెందిన ఇసుకుపాటి యేసురాజులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు. నేరం రుజువు కావటంతో ముద్దాయిలకు నాలుగు నెలల జైలు శిక్షను విధిస్తూ ఏజేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ ఆశీర్వాదపాల్ శుక్రవారం తీర్పునిచ్చినట్టు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

సీఎం జగన్‌తో సంక్షేమ పాలన



అండ్రంగిలో మహిళకు పథకాలు వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

కాజులూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం అండ్రంగిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ పలకరించారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందుతున్నది లేనిది అడిగారు. కుల మతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకూ వ్యక్తిగతంగా లబ్ధి చేకూరుతుందన్నారు. రానున్న ఎన్నికలలో ప్రజలు తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవటం ద్వారా భవిష్యత్తులో మరిన్ని పథకాలను పొందగలుగుతారన్నారు. ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని మంత్రి వేణు మహిళలకు సూచించారు. పలు సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకరాగా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంత్రి ప్రారంభించారు. ఎంపీపీ మాత భారతి మురళి, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, సర్పంచ్ పెద్దిరెడ్డి నాగసుజాత, మండల వైఎస్సార్ సీపీ సేవాదళ్ కన్వీనర్ టేకుమూడి దుర్గారావు, పీఏసీఎస్ చైర్మన్ సమనాశి సోమన్న, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే ముస్లింలకు మేలు



ద్రాక్షారామలో మాట్లాడుతున్న వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో ముస్లింలకు వైఎస్సార్ సీపీతోనే మేలు జరుగుతుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ అన్నారు. శుక్రవారం ద్రాక్షారామలో ఆయన పర్యటించారు. గ్రామంలోని మసీదులు, పంజాలు, ఖబర్‌స్థాన్‌లను పరిశీలించారు. అనంతరం జామియా జాఫ్రీ మసీదు (పెద్ద మసీదు)లో వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి, ద్రాక్షారామకు చెందిన డైరెక్టర్ ఎండీ జాఫర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఖాదర్ మాట్లాడారు. ముస్లింలకు అనేక పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు కల్పించిన రిజర్వేషన్లతో ఎందరో ఉద్యోగాలు పొందారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందరికీ మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ సజ్జాద్ హుస్సేన్, మత గురువు మీర్జా అస్కరి మౌలానా, ఆగా అబ్దుల్ ఘనీ, మీర్జా అలీ హుస్సేన్, జాకీర్ హుస్సేన్, బాకర్, సాహిన్, అసోర్‌ఖానా ముజావర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కమిషనర్ రామ్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు

మండపేట: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా పట్టణంలో చేపట్టిన భూముల రీసర్వే విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని డీఎంఏ ఆదేశించింది. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, టౌన్‌ప్లానింగ్, సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితర శాఖలకు చెందిన ఉద్యోగులతో శుక్రవారం డీఎంఏ నుంచి ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీ సర్వే, ప్లాస్టిక్ నిషేధం అమలు తదితర అంశాలపై ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో భూముల రీసర్వే శరవేగంగా జరుగుతోందన్నారు. డ్రోన్, కార్స్ నెట్‌వర్క్, రోవర్ తదితర ఆధునిక పరికరాల ద్వారా ప్రతి స్థిరాస్తినీ అత్యంత కచ్చితంగా భూ అక్షాంశం, రేఖాంశాలతో గుర్తించి కొత్త సర్వే, రెవెన్యూ రికార్డులను తయారు చేస్తున్నామన్నారు. జూలై నాటికి హక్కు పత్రాలను యజమానులకు అందజేయనున్నట్టు కమిషనర్ రామ్‌కుమార్ తెలిపారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించిన ప్రిన్సిపాల్ తదితరులు

రామచంద్రపురం: విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలని స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సోమశేఖర్ తెలిపారు. ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో విజేతలకు ఆయన కళాశాలలో శుక్రవారం బహుమతులు అందజేశారు. పీడీ జంపన రఘురామ్ మాట్లాడుతూ కళాశాల పరిధిలో అంతర్గత క్రీడా పోటీల్లో భాగంగా బాలుర విభాగంలో కబడ్డీ, వాలీబాల్, బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించామన్నారు. బాలుర, బాలికలకు అథ్లెటిక్స్‌కు సంబంధించి 100, 400 మీటర్ల పరుగు పందెం, షార్ట్‌పుట్ విభాగాల్లో పోటీలు జరిగాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని అండర్-19 పోటీలకు పంపించామన్నారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారం పంపిణీ



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ నాగరాజు తదితరులు

కె.గంగవరం: పామర్రు ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు లేని పేద పిల్లలకు శుక్రవారం దుస్తులు, పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. పదాల ట్రస్ట్ నిర్వహణలో వారధి సంస్థ పేద విద్యార్థులను దత్తత తీసుకుని వారి చదువు, ఆరోగ్యం చూసుకుంటుంది. ఈ ఏడాది కూడా సంస్థ ఆధ్వర్యంలో ఎంఈఓ ఎ.నాగరాజు విద్యార్థులకు కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారధి సంస్థ దాతృత్వాన్ని కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, దాతల ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్ఎం పితాని శ్రీనివాస్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న సీఐ శివగణేష్, ఎస్ఐ అప్పారావు

మండపేట: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని మండపేట సీఐ పి.శివగణేష్ సూచించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు కళాశాలల్లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై సీఐ శివగణేష్, ఎస్ఐ కె.అప్పారావు అవగాహన కల్పించారు. అతివేగం ప్రమాదాలకు కారణమన్నారు. యువకులు నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, అందుకనుగుణంగా విద్యార్థులు నడుచుకోవాలని సూచించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రమాణాలతో నాణ్యమైన విద్య



విద్యార్థులకు సంస్కార విద్యపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసచౌదరి

రాయవరం: ఉత్తమ ప్రమాణాలతోనే విలువలతో కూడిన నాణ్యమైన విద్య సాధ్యమని విశ్వ మానవతా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి పేర్కొన్నారు. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మానవతా సంస్కార విద్యపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసచౌదరి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి ఆరోగ్యం, పరిపూర్ణ విద్య, ఉన్నత వ్యక్తిత్వం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో సంస్కార విద్యపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేస్తేనే స్వచ్ఛ భారత్‌ను నిర్మించగలమన్నారు. ఈ నెల 21, 22వ తేదీల్లో సాధనా తరగతులు నిర్వహిస్తున్నామని, పాల్గొనే ఆశక్తి ఉన్న వారు 99666 73283 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల, లొల్ల మానవతాశ్రమంలో ప్రతీ ప్రభుత్వ పాఠశాల నుంచి 5-10 మంది విద్యార్థులకు ఉచితంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు.

పౌర సేవలను ప్రజలకు వివరించాలి

రాయవరం: అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఈ-సర్వీస్ పోర్టల్ ద్వారా అందిస్తున్న అన్ని రకాల సేవలను ప్రజలకు వివరించాలని, సర్వీస్ రిక్వెస్ట్‌లను పెంచాలని ఎంపీడీఓ డి.శ్రీనివాస్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఇంజినీరింగ్, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి సచివాలయం నుంచి 100 సర్వీస్ రిక్వెస్ట్‌లను చేయాలని ఆదేశించారు. సర్వీస్ రిక్వెస్ట్‌లకు వసూలు చేసే రుసుము ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమచేయాలని సూచించారు. ఐఆర్‌సీటీసీ యాప్ ద్వారా ట్రైన్ టికెట్లు బుకింగ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. హౌస్ హోల్డ్ కార్డుల స్ప్రింటింగ్‌కు అవకాశం ఇచ్చినందున బియ్యం కార్డుల జారీకి చర్యలు చేపట్టాలని తెలిపారు. 10, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీకి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. దీనికి అనుగుణంగా వలంటీర్ల ద్వారా సర్వే చేసి అర్హులైన వారికి సర్టిఫికెట్లు మంజూరు చేయాలని సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి ఉగాది నాటికి 319 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ సత్యనారాయణరెడ్డి ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు.

జంతువులపై ప్రేమ చూపించాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఏడీ రామకృష్ణ, బిందు

కె.గంగవరం: ప్రతి ఒక్కరూ జంతువుల ప్రాముఖ్యత తెలుసుకుని వాటిపై ప్రేమ చూపించాలని రామచంద్రపురం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ఓరుగంటి రామకృష్ణ అన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల సందర్భంగా పామర్రులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం జంతువుల పరిరక్షణపై విద్యార్థులకు పోటీ పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పశు వైద్యురాలు మోటుపల్లి బిందు తదితరులు పాల్గొన్నారు.